# సంపాదకీయ దర్జా

తొమ్మిదిన్నర ఔతుంది. రాత్రి మూడేసేదాకా చలపతితో బాతాఖానీ కొడుతూ మేలుకున్నాను. రాకరాక వచ్చానని రైలు దిగీదిగటంతోనే కలుసుకుని యింటికి తీసుకెళ్ళి కబుర్లతో హూనం హూనం చేశాడు. గోష్ఠి అవిచ్ఛిన్నంగా జరిగింది. చలపతి నిద్దరన్నమాటే మరిచిపోయాడు. మూడుంబావుకు పడుకున్నామేమో.... ఎనిమిదింబావుదాకా నాకు మెళుకువ రాలేదు. చలపతి ఇంకా లేవనేలేదు. అనుష్టానాలన్నీ తీర్చుకుని చలపతిని లేపాను. లేచి వొళ్ళు విరుచుకుని, తాపీగా 'ఇంకో గంటైనా అధమం నిద్రపోవల్సిందే' అని చలపతిరావు మళ్ళీ కుంభకర్ణుడితో నేస్తం కలిపాడు. సరే— వెల్‌కం హోటలుకు పోయివద్దామని బయలుదేరాను. దారిలో యిద్దరు ముగ్గురు స్నేహితులను చిరునవ్వుతో తప్పించు

కుని హోటలుకి చేసుకునేసరికి— మనవాడు రామారావు ప్రత్యక్ష మైనాడు. 'ఏమోయ్! రామారావ్!' అన్నాను: 'ఓహో! శాస్త్రీ! వెల్కం! రా పోదాం' అన్నాడు.

ఇద్దరం హోటల్లోకి వెళ్ళాము. తినుబండారాలకు ఆర్డరిచ్చి రామారావు ప్రస్తుత పరిస్థితులు మాట్లాడుతున్నాడు.

"ఎవరైనా కవి మిత్రులున్నారా వూళ్ళో?"

"శివశంకరశాస్త్రిగారు నిన్ననే కంతేరు వెళ్ళారు!"

"అరే! లేరే! కాస్సేపు గోష్టికి!"

"ఆముదంచెట్టు.... లాగు నేనే కవిమిత్రుణ్ణి!"

"అచ్ఛా!"

"జ్వాల అచ్చు ఎప్పుడు మొదలెడతారోయ్!"

"ముద్దుక్రిష్ణ వొచ్చాక ప్రారంభిస్తాడనుకుంటా!"

"నువ్వేం చేస్తున్నావూ?"

"సీతోపాటు బాతాఖానీ వేస్తున్నాగా!"

"అది సరేలే! ఏమి వ్యాపారం సాగించ సంకల్పించావన్నమాట?"

"పత్రిక రన్ చేద్దామనుకుంటున్నా!"

"ఉంహూం"

.... .... .... ....

"ఎప్పుడు ప్రారంభం చేస్తావ్!"

"ఇదిగో నెలాఖర్నే"

"ఎడ్వర్టైజ్మెంట్లు సంపాయించావా?"

"ఓ!"

"కథలు!"

"అవే తక్కువగా ఉన్నాయి. మునిమాణిక్యానికి రాశాను!"

"ఏమన్నాడూ"

"జవాబు రాలేదు"

"శిరోమణితో సంప్రతించావా?"

బుర్ర ఆడించి.... "ఏ దేశంలో వున్నాడో తెలియలేదు."

"పోనీ గుంటూరు వెళ్ళి కనుక్కోకపోయినావా?"

"ఇవాళే గుంటూరు పోతున్నాను."

"వెంకటచలం!"

"అబ్బ వొద్దోయి మనకా కథలు!"

"ఏం!"

"మనం తట్టుకోలేము!"

"సరే"

"బాపిరాజును బొమ్మ గీయమని రాశానుగా!"

"శుభం!"

"శివశంకరశాస్త్రుల్లువారు వ్రాస్తారా?"

"ఎందుకు వ్రాయరూ?"

"కవికొండలవారు!"

"అప్పుడే పద్యాలకట్టలు పంపించారోయ్!"

"యింకా!"

"బొడ్డు బాపిరాజు పద్యాలు పంపించాడు!"

"అడవి బాపిరాజుకి మళ్ళీ రాయి; కథలూ, పద్యాలూ కూడా పంపమని!"

"ఆ లోటేమీ చేయలేదు!"

"యిదుగో వొఖమాట చెప్తున్నా విను, ఆ జొన్నలగడ్డ సత్య నారాయణమూర్తిగారితో కూడా కాస్త మంచిమాట చేసుకో! నీకు పుష్కలంగా.... మేటరు దొరుకుతుంది!"

".... .... .... ...."

"చూడూ—విలువ వున్న మేటరు దొరుకుతుందోయ్!"

"అల్లాగే రాస్తాను!"

2

సాయంత్రం నాలుగున్నరకు రామారావు చలపతి యింటి వాకిట్లోంచి పిలిచాడు. 'గుంటూరుపోలేదా' అంటే పోలేదన్నాడు. షికారుకు వెళదామని మొండిపట్టుపట్టాడు. ఏమిటోయ్? యిప్పుడు షికారా! అంటే కాదుకూడదని బయలుదేర తీశాడు. కాఫీదేవీ... నమస్తుభ్యం! అని కాఫీ ప్రార్థన చేశాక అవునోయ్ శాస్త్రీ అప్పుడు నువ్వు రాశావు చూడూ—. అనగానే నేనందుకుని అది యిక్కడ లేదోయ్! బందరులో వుందన్నాను.

పోనీలే! యిప్పుడు మళ్ళీ రాయరాదూ? అన్నాడు. కథంఘటతే నాయనా? అని అన్నాను వింటేగా? హుషార్ సామగ్రి సమర్పించు కుంటున్నాను. ఆc! ఎందుకోయ్ బందరుపోయి పంపిస్తాలే! అని కాస్సేపు ఉండి సర్దుకున్నాను.

"శాస్త్రీ!"

".... .... .... ...."

"బందరు వెళ్ళగానే మునిమాణిక్యాన్ని కాస్త మనకు సుముఖుణ్ణి చేసి కథ పంపమను"

"అలాగే!"

"చూడూ—శాస్త్రిగారితో కూడా....చెప్పు. కథ కావాలన్నానని"

"సరే!"

"మరిచిపోకు—నువ్వుకూడా—ఓకథా ఓఛందశ్చర్చా—పంపు"

"చిత్తం"

"నీ దగ్గిర సామెతల పుస్తకం ఉందా?"

"అంటే?"

"నువ్వు కలెక్ట్ చేసింది"

"వుండాలి"

"అది కూడా పంపు. ప్రతినెలా కొన్ని చొప్పున వేస్తాను."

"సరేలే—"

"ప్రబుద్ధాంధ్ర హిందీ మీద విరుచుకు పడ్డదోయ్! మనం ప్రబుద్ధాంధ్రకు ప్రతిగా పని చేయాలి!"

"అదోటి కూడానా!"

"అవును ఈ హిందీ—మన్ని వుద్ధరించే భాష!"

"ఉఁ హూఁ!"

"సరేగాని యింటికి పోదాము లే!"

"ఈమాటలు చెప్పటానికేనటోయ్! నన్ను యిక్కడకు లాక్కొస్తి?"

"భలేవాడివోయ్! శాస్త్రీ!"

## 3

ఇంటికి వొచ్చేశాను. బందరు వొచ్చేసిన రెండుమూడు రోజులకు రామారావు దగ్గర నుంచి ఉత్తరం వొచ్చింది —మా వాడు బాహాటంగా —మాడరన్ రివ్యూ దర్జాతో—పత్రిక నడుస్తుందని ఎడ్వర్‌టైజ్‌మెంటు చేస్తున్నాడు పత్రికల్లో—రెణ్ణెల్లయింది, మా బాబాయి రమ్మంటే—బెజవాడ వెళ్ళి—మధ్యాన్నం రామారావు యింటికి వెళ్లాను.

'ఓః సమయానికి చక్కావొచ్చా' వంటూ తలుపు తీశాడు. మామూలు మర్యాదలూ, లాంఛనాలూ అయింతరవాత—కారం రాసిన కందిపప్పు, అప్పడాల పిండీ—పకోడీలు ముందుపెట్టి తాను కందిపప్పు కరకరా నముల్తూ బాతాఖానీ కొడ్తున్నాడు. ఏమిటిరా అబ్బీ! ఈ రభస అంటే యివాళ ఎడిటోరియల్ రాయాలోయ్! అన్నాడు. మిగిలిన ఫారాలు ప్రింటయినాయా అంటే యీ ఫారం ముందు ప్రింట్ చేయిస్తున్నాను. కథలూ అవీ యింకా రాలేదు అన్నాడు.

బాపిరాజు బొమ్మ వేయలేదా అంటే—లేదన్నాడు. మరి పద్యాలు వొచ్చాయన్నావుకదా అంటే అవేవీ యింకా రాలేదు వొస్తాయి—రేపో—ఎల్లుండో—అన్నాడు. మరి అప్పుడల్లా చెప్పావేమంటే—అల్లాగే **చెప్పాలి**—నీకు తెలియదన్నాడు.

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారికి రాశావా అంటే—యింకా రాయలేదు, రేపో ఎల్లుండో — రాస్తానన్నాడు. అంటూనే యింట్లోకిపోయి—కాఫీ—రెండు వెండి గిన్నెలతో తెచ్చాడు. చవి చూద్దునుగదా— ఫ్లేవర్—లేదు సరేకదా— మిరియాల కషాయంలా వుంది. తప్పనిసరిగా తాగాను. ఇంకా విశేషాలేమిటిరా అంటే,

యిల్లు అద్దెకు తీసుకున్నాను. అచ్చాఫీసు ఓటి కొంటున్నాను. ఇకనుంచీ రెగ్యులర్‌గా పత్రికను నడుపుతాను అన్నాడు.

డబ్బుఎక్కడిదిరా? అంటే ఎవరో జమీందార్ ఫ్రెండ్ యిస్తాడులే! అన్నాడు. యిస్తాడా? నువ్వు అనుకుంటున్నావా అంటే— యిస్తే యిస్తాడు. లేకపోతే—పొలం అమ్మైనా కొంటాను. షూర్! అని చేతిలో చెయ్యి వేశాడు. అంతా విని విని-చెడిపోతావురా అబ్బీ! అన్నాను.

"ప్చ్"
అని నా వంక పరమసాహసి చూపులు చూశాడు.

యిప్పటికీ పత్రిక—రానేలేదు. మొన్న కనిపించి—ఏంరా! అబ్బీ! అంటే?

"కష్టాలు వొచ్చినా .... కాలమే తరిమినా కన్నీళ్ళు రాల్చకే—, కలుష మెరుగని చెలీ!" అని—దూసుకు చక్కాపోయాడు.